




ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం

# జనం ముచ్చట

శుక్రవారం, సెప్టెంబర్ 11, 2026 | తెలంగాణ | పేజీలు : 4




## గణేష్ నవరాత్రుల ఉత్సవాలు

# ప్రశాంతంగా నిర్వహించాలి

## పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**ఖమ్మం (జనం ముచ్చట)సెప్టెంబర్ 10:** గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ గణేష్ మండపాల నిర్వాహకులకు సూచించారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.గణేష్ నవరాత్రుల ఉత్సవాల నేపథ్యంలో ఖమ్మం నగరంలోని సూర్య తేజ ఫంక్షన్ హాల్‌లో గణేష్ మండపాల నిర్వాహకులతో పోలీసు అధికారులు సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఉత్సవాల నిర్వహణలో పాటించాల్సిన భద్రతా నిబంధనలు, పోలీస్ శాఖ సూచనలు, ముందస్తు జాగ్రత్తలు, ఊరేగింపులు, నిమజ్జనం తదితర అంశాలపై నిర్వాహకులకు అవగాహన కల్పించారు....

కొత్తూరు చెరువులో నిమజ్జన ఏర్పాట్లు.... ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ.. గణేష్ ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు మండపాల నిర్వాహకులు





2 లో..

పోస్టర్ ఆవిష్కరిస్తున్నపోలీస్ కమిషనర్ సునీల్ దత్, ఇతర అధికారులు





**ఖమ్మం సిటీ (జనం ముచ్చట):** ఖమ్మం నగరంలో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి తన రెండో భార్యను గొంతు నులిమి హత్య చేసిన ఘటన తీవ్ర కలకలం రేపింది. భార్యను హత్య చేసిన అనంతరం ఆమె మృతదేహాన్ని కారులోనే ఉంచుకుని తిరిగిన నిందితుడు.. చివరకు కారును ఓ ప్రాంతంలో నిలిపి,తాను భార్యను హత్య చేసినట్లు స్నేహితుడికి ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. తాను కూడా చనిపోతున్నట్లు చెప్పడంతో ఆందోళనకు గురైన స్నేహితుడు పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో పోలీసులు ఫోన్ సిగ్నల్ ఆధారంగా నిందితుడి ఆచూకీని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

## క్షణికావేశంలో గొంతు నులిమి

# భార్యను హత్య చేసిన భర్త

**నాలుగు నెలల క్రితమే రెండో వివాహం....**

పోలీసు వర్గాల సమాచారం ప్రకారం.. ఇల్లెందుకు చెందిన మేడిపల్లి విద్యాసాగర్ (44) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ కలహాల కారణంగా మొదటి భార్యతో విడాకులు తీసుకున్న విద్యాసాగర్.. అనంతరం తనకు పరిచయమైన చిన్నబోయిన రేణుకను సుమారు నాలుగు నెలల క్రితం రెండో వివాహం చేసుకున్నాడు. వివాహం అనంతరం ఖమ్మంలోని సీసీఎస్ పోలీస్ స్టేషన్ పరిధిలో రేణుకతో కలిసి నివాసముంటున్నట్లు తెలుస్తోంది....

**వివాహేతర సంబంధంపై అనుమానంతో కలహాలు...**

రేణుకకు మరో వ్యక్తితో వివాహేతర సంబంధం ఉందనే అనుమానం విద్యాసాగర్‌కు ఏర్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ విషయమై భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే బుధవారం సాయంత్రం విద్యాసాగర్ తన భార్య రేణుకను కారులో ఎక్కించుకుని బయటకు తీసుకెళ్లాడు.కారులో ప్రయాణిస్తున్న సమయంలో ఇద్దరి మధ్య మరోసారి ఘర్షణ జరిగినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆగ్రహానికి గురైన విద్యాసాగర్.. రేణుక గొంతు నులిమి హత్య చేసినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు సమాచారం....

2 లో..

**ఖమ్మంలో దారుణం.. భార్యను గొంతు నులిమి హత్య... ఫోన్ సిగ్నల్ ఆధారంగా నిందితుడి ఆచూకీ గుర్తించిన పోలీసులు.....**

# గణేష్ నవరాత్రుల ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

(మొదటి పేజి తరువాయి)

పోలీస్ శాఖకు పూర్తిగా సహకరించాలని కోరారు. మండపాల ఏర్పాటు నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన,పూజా కార్యక్రమాలు,ఊరేగింపు, నిమజ్జనం వరకు ప్రతి అంశాన్ని ముందస్తు ప్రణాళికతో నిర్వహించాలన్నారు. మున్నేరు వద్ద నీటి లభ్యత తక్కువ.. ప్రత్యామ్నాయ నిమజ్జన ప్రాంతంఖమ్మం మున్నేరు నదిలో ప్రస్తుతం నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో వినాయక విగ్రహాల నిమజ్జనానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు సీపీ తెలిపారు. ఖమ్మం అర్బన్ మండలంలోని దంసలాపురం గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తూరు చెరువులో నిమజ్జన ఏర్పాట్లు కొనసాగుతున్నాయని వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని మట్టి విగ్రహాల ప్రతిష్ఠాపనకు నిర్వాహకులు సహకరించాలని ఆయన సూచించారు....

**ఆన్‌లైన్‌లో మండపాల వివరాలు నమోదు చేయాలి...**

గణేష్ మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖ పోర్టల్ జూశీశ్రీఱఎవజూశీశ్మీశ్రీ.ంజూశీశ్రీఱఎవ.ప్తశీజ.ఱఅలో రిజిస్టర్ చేసుకుని మండపాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సీపీ సూచించారు. ఇలా వివరాలు నమోదు చేసుకోవడం ద్వారా మండపాల ఏర్పాటు, విగ్రహ ప్రతిష్ఠాపన, పూజా కార్యక్రమాలు, ఊరేగింపులు, నిమజ్జనం తదితర కార్యక్రమాలను ముందస్తుగా ప్రణాళిక చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

మండపాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ కనెక్షన్లు, వైరింగ్‌ను నిపుణులతో తనిఖీ చేయించాలని సూచించారు. అగ్ని ప్రమాదాల నివారణకు అవసరమైన ఫైర్ సేఫ్టీ పరికరాలు, నీరు, ఇసుక అందుబాటులో ఉంచాలని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన మార్గాలను ఎట్టి పరిస్థితుల్లోనూ మూసివేయరాదని స్పష్టం చేశారు....



**గణేశుని మండపాల్లో డీజేలకు అనుమతి లేదు....**

డీజేలు, అధిక శబ్దంతో కూడిన సౌండ్ సిస్టమ్‌ల వినియోగానికి అనుమతి లేదని పోలీస్ అధికారులు స్పష్టం చేశారు. రెండు మైక్‌లతో కూడిన స్పీకర్లను మాత్రమే నిబంధనలకు అనుగుణంగా వినియోగించాలని సూచించారు.ధ్వని పరిమాణం ప్రజలకు ఇబ్బంది కలిగించని స్థాయిలో ఉండాలని, ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే మైక్ సౌండ్ సిస్టమ్ వినియోగించాలని తెలిపారు.మండపాల వద్ద అసభ్యకరమైన నృత్యాలు, కార్యక్రమాలు నిర్వహించరాదని నిర్వాహకులకు స్పష్టం చేశారు.....

**24 గంటలూ ఇద్దరు నిర్వాహకులు అందుబాటులో ఉండాలనీ.....**

ప్రతి గణేష్ మండపం వద్ద కనీసం ఇద్దరు నిర్వాహకులు 24 గంటలూ అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని పోలీసులు సూచించారు. మండపం వద్ద నోటీసు బోర్డు, పాయింట్ బుక్ ఏర్పాటు చేసి నిర్వాహకుల పేర్లు, సంప్రదింపు నంబర్లు తదితర వివరాలను తప్పనిసరిగా పొందుపర్చాలని తెలిపారు. విగ్రహం ఏర్పాటు చేసే స్థలం ప్రైవేట్ వ్యక్తికి చెందినదైతే సంబంధిత యజమానుల నుంచి ఎటువంటి అభ్యంతరం లేదని తెలిపే ధృవీకరణ పత్రాన్ని పొందాలని సూచించారు, అదే విధంగా గణేష్ విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులతో సమన్వయం చేసుకోవాలని సీపీ సూచించారు.పోలీసులు నిర్ణయించిన మార్గాలు, సమయాలను తప్పనిసరిగా పాటించాలని,ఊరేగింపులో పాల్గొనే వారు క్రమశిక్షణతో వ్యవహరించేలా నిర్వాహకులు బాధ్యత తీసుకోవాలని తెలిపారు.నిమజ్జన ప్రాంతాల్లో విద్యుత్ ప్రమాదాలు, నీట మునిగే ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ముఖ్యంగా చిన్నారులు, ఈత రాని వారు నీటిలోకి వెళ్లకుండా నిర్వాహకులు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని కోరారు.....

**నిర్వాహకుల పేర్లు, సంప్రదింపు నంబర్లు నమోదు చేయాలి.....**

ప్రైవేట్ స్థలంలో మండపం ఏర్పాటు చేస్తే యజమాని నుంచి నిరభ్యంతర ధృవీకరణ పత్రం పొందాలి. రహదారులు, వివాదాస్పద స్థలాల్లో విగ్రహాలను ఏర్పాటు చేయకూడదనీ అదే విధంగా ప్రధాన,రద్దీ రహదారులపై మండపాలు ఏర్పాటు చేయరాదనీ. షార్ట్‌సర్క్యూట్ నివారణకు నాణ్యమైన విద్యుత్ తీగలు, పరికరాలు ఉపయోగించాలనీ,డీజేలకు అనుమతి లేనందు వలన రెండు మైక్‌లతో కూడిన స్పీకర్లను మాత్రమే నిబంధనలకు అనుగుణంగా వినియోగించాలనీ,ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే సౌండ్ సిస్టమ్ వినియోగించాలని సిపి సూచించారు...ఈ సమన్వయ సమావేశంలో ఏసీపీ రమణమూర్తి, ఎస్బీ ఏసీపీ మహేష్, ఇన్‌స్పెక్టర్లు కరుణాకర్, బాలకృష్ణ, మోహన్ బాబు, భానుప్రకాష్, ఉస్మాన్ షరీఫ్, సత్యనారాయణ, విద్యుత్ శాఖ డీఈ రామారావు, ఫైర్ అధికారి రామిరెడ్డి, గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు వినోద్ లౌహిటి, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు....

# క్షణికావేశంలో గొంతు నులిమి భార్యను హత్య చేసిన భర్త



(మొదటి పేజి తరువాయి)

**ఫోన్ సిగ్నల్‌తో ఆచూకీ గుర్తింపు....**

ఫోన్ సిగ్నల్ ఆధారంగా విద్యాసాగర్ ఖమ్మం-ఇల్లెందు రోడ్డులోని ప్రగతి స్కూల్ సమీపంలో ఉన్నట్లు పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో పోలీసులు అక్కడికి చేరుకున్నారు.

విద్యాసాగర్ ఫోన్ నంబర్‌కు పోలీసులు రింగ్ చేయగా.. ప్రగతి స్కూల్ పక్కనే నిలిపి ఉంచిన కారుకు సమీపంలో అతను ఉన్నట్లు గుర్తించారు. వెంటనే అతడిని అదుపులోకి తీసుకున్నారు.నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు అతను నిలిపిన కారును పరిశీలించగా.. అందులో రేణుక మృతదేహం ఉన్నట్లు గుర్తించారు.దీంతో కారును స్వాధీనం చేసుకుని మృతదేహాన్ని బయటకు తీసి తదుపరి చర్యలు చేపట్టారు.ప్రస్తుతం విద్యాసాగర్ ఖమ్మం అర్బన్ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం..ఘటనకు దారితీసిన పూర్తి కారణాలు, భార్యాభర్తల మధ్య జరిగిన ఘర్షణకు సంబంధించిన వివరాలు, హత్యకు ఉపయోగించిన విధానం తదితర అంశాలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఈ ఘటన ఖమ్మం నగరంలో తీవ్ర కలకలం రేపింది.కుటుంబ కలహాలు చివరకు హత్యకు దారితీయడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలను వెల్లడించే అవకాశం ఉంది.....



**స్నేహితుడికి ఫోన్‌తో వెలుగులోకి ఘటన...**

భార్యను హత్య చేసిన అనంతరం విద్యాసాగర్ తన కారులోనే రేణుక మృతదేహాన్ని ఉంచుకున్నాడు. అనంతరం ఇల్లెందులోని తన స్నేహితుడికి ఫోన్ చేసి.. తాను తన భార్యను హత్య చేసినట్లు చెప్పినట్లు సమాచారం. అంతేకాకుండా తాను కూడా చనిపోతున్నట్లు చెప్పడంతో స్నేహితుడు తీవ్ర ఆందోళనకు గురయ్యాడు.వెంటనే రఘునాథపాలెం పోలీసులకు ఫోన్ చేసి విషయం తెలియజేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు అప్రమత్తమై విద్యాసాగర్ ఫోన్ సిగ్నల్‌ను ట్రాక్ చేయడం ప్రారంభించారు....

# పోషణ సేవలను బలోపేతం చేయడంలో కుటుంబాలు, సమాజం చురుకైన భాగస్వామ్యం కావాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్.**

**ఖమ్మం కలెక్టరేట్ సెప్టెంబర్-10: జనం ముచ్చట**




జిల్లాలో సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8, 2026 వరకు నెల రోజుల పాటు జాతీయ పోషణ మాసం కార్యక్రమాలను ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. గురువారం మహిళా,శిశు, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ పోషణ మాసం ప్రారంభ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మన అంగన్వాడీ -- మన బాధ్యత కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ పోషణ అనేది ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని తెలిపారు. పిల్లలు, గర్భిణీలు, బాలింతలు, మహిళలకు మెరుగైన పోషకాహారం అందించడంతో పాటు పోషణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు జాతీయ పోషణ మాసం సందర్భంగా విస్తృత కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

పోషణ సేవలను బలోపేతం చేయడంలో కుటుంబాలు, సమాజం చురుకైన భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని కలెక్టర్ తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషణ సేవలు, సమతుల్య ఆహారం, ఆరోగ్యం, పరిశుభ్రత, తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

మన అంగన్వాడీ -- మన బాధ్యత' నినాదం తో ప్రతి అంగన్వాడీ కేంద్రాన్ని ప్రజలకు చేరువ చేస్తూ, పోషణ కార్యక్రమాల్లో స్థానిక ప్రజలు, తల్లిదండ్రులు, మహిళా సంఘాలు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది భాగస్వామ్యం పెంచేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. జాతీయ పోషణ మాసం సందర్భంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పోషణ, ఆరోగ్యం, పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, కార్యక్రమాల వివరాలను సమగ్రంగా నమోదు చేసి విజయవంతంగా అమలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు, జిల్లా పంచాయతీ అధికారి వినోద్ కుమార్, సెర్ప్ అధికారులు, విద్యాశాఖ అధికారులు, పోషణ అభియాన్ డీసీ కె. బాబు, డీపీఏ శ్రీనివాస్, ఈవో, హబ్ కో ఆర్డినేటర్ సమీర్, తదితరులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా పోరాటాలు

## సీపీఎం జిల్లా నాయకులు వై. విక్రమ్,యర్రా శ్రీనివాసరావు

ఖమ్మం సిటీ (జనం ముచ్చట):

భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పేద ప్రజలకు ధైర్యం చెబుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో చరిత్ర సృష్టించిన వీరవనిత చిట్యాల ఐలమ్మ స్ఫూర్తితో నేటి ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని సీపీఎం జిల్లా నాయకులు వై. విక్రమ్, యర్రా శ్రీనివాసరావు అన్నారు.తెలంగాణ సాయుధ పోరాటం, చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని గుర్తు చేస్తూ నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. ఆనాడు భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పేదలు, రైతులు, కూలీలు, సామాన్య ప్రజలను సమీకరించి కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో సాగిన పోరాటాలు తెలంగాణ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాయని పేర్కొన్నారు.కమ్యూనిస్టుల నాయకత్వంలో సాగిన పోరాటాల ఫలితంగా పేద ప్రజలకు భూములు దక్కాయని, సుమారు పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టులకే దక్కుతుందని వారు తెలిపారు. భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచి, వారికి అండగా నిలిచిన పోరాట యోధుల త్యాగాలను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.



**సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించొద్దు....**

తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని వై. విక్రమ్, యర్రా శ్రీనివాసరావు ఆరోపించారు. ముఖ్యంగా బీజేపీ నాయకులు తెలంగాణ సాయుధ పోరాటాన్ని హిందువులు, ముస్లింల మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.తెలంగాణ సాయుధ పోరాటం ప్రధానంగా భూస్వామ్య దోపిడీ, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పేదలు, రైతులు, కూలీలు సాగించిన ప్రజా పోరాటమని వారు పేర్కొన్నారు. చరిత్రను వక్రీకరించి మతాల మధ్య విభేదాలు సృష్టించడం ద్వారా ప్రజల్లో మతోన్మాదాన్ని పెంచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇలాంటి ప్రచారాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.

**స్వాతంత్ర్య ఉద్యమంలో బీజేపీకి చరిత్ర లేదు...**

దేశ స్వాతంత్ర్య ఉద్యమంలోనూ, తెలంగాణ సాయుధ పోరాటంలోనూ బీజేపీకి ఎలాంటి చారిత్రక పాత్ర లేదని సీపీఎం నాయకులు విమర్శించారు. చరిత్రలో తమకు స్థానం లేని వారు ఇప్పుడు గత పోరాటాలకు తమదైన రంగు పులమాలని ప్రయత్నించడం "దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని"వారు ఎద్దేవా చేశారు. ప్రజల సమస్యలు, భూమి, ఉపాధి, సామాజిక న్యాయం వంటి అంశాలపై నిరంతరం ప్రజా ఉద్యమాలను నిర్మించాల్సిన అవసరం ఉందని అన్నారు. చాకలి ఐలమ్మ వంటి పోరాట యోధుల స్ఫూర్తితో ప్రజల హక్కుల కోసం ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో త్రీ పార్టీ కార్యదర్శి భుక్యా శ్రీనివాసరావు, వజేనేపల్లి శ్రీనివాసరావు, ఎస్.కె. సైదులు, బండారు వీరబాబు, జార్జ్, లింగయ్య, జెల్లా ఉపేంద్ర,కార్పొరేటర్ ఎల్లంపల్లి వెంకట్రావు, పసుమర్తి రాంమోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# పోడు సాగుదారులందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలి



## సీపీఐ(ఎం) రఘునాథపాలెం మండల కార్యదర్శి ఎస్. నవీన్ రెడ్డి

రఘునాథపాలెం: జనం ముచ్చట

మండలంలోని వివిధ గ్రామాల్లో పోడు భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న పేద గిరిజనేతర రైతులందరికీ ప్రభుత్వం వెంటనే హక్కు పత్రాలు మంజూరు చేయాలని సీపీఐ(ఎం) రఘునాథపాలెం మండల కార్యదర్శి ఎస్. నవీన్ రెడ్డి డిమాండ్ చేశారు. హక్కు పత్రాలు పొందిన రైతులకు వ్యవసాయ అవసరాల కోసం విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు బోర్లు వేసుకునేందుకు అనుమతులు ఇవ్వాలని కోరారు.రఘునాథపాలెం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన పోడు సాగుదారుల గ్రీవెన్స్ డే కార్యక్రమంలో సీపీఐ(ఎం) రఘునాథపాలెం మండల కమిటీ ఆధ్వర్యంలో ఐటీడీఏ ఏపీడీ డేవిడ్ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్. నవీన్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని గణేశ్వరం, చింతగుర్తి, దొనబండ, మల్లేపల్లి, పంగిడి, ఈర్లపూడి తదితర గ్రామాల్లో అనేకమంది పేద గిరిజనేతరులు భూములను నమ్ముకుని వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారని తెలిపారు. అయితే పోడు భూములపై హక్కు పత్రాలు లేకపోవడంతో రైతులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. పంట రుణాలు పొందడం, విద్యుత్ కనెక్షన్లు తీసుకోవడం, వ్యవసాయ బోర్లు ఏర్పాటు చేసుకోవడం వంటి అంశాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అంతేకాకుండా పండించిన పంటను మార్కెట్లో విక్రయించే సమయంలో కూడా హక్కు పత్రాలను అడుగుతున్నారని, దీంతో పేద రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.ఇప్పటికే హక్కు పత్రాలు పొందిన రైతులకు సైతం వ్యవసాయానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో సమస్యలు ఉన్నాయని నవీన్ రెడ్డి తెలిపారు. హక్కు పత్రాలు మంజూరు చేసిన రైతులకు విద్యుత్ సౌకర్యం, వ్యవసాయ బోర్లకు అనుమతులు తదితర సదుపాయాలు కల్పించాలని కోరారు....
పోడు సాగు చేసుకుంటున్న అర్హులైన గిరిజనేతర పేద రైతులందరినీ గుర్తించి వారికి హక్కు పత్రాలు అందించాలని, రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. హక్కు పత్రాలు అందించడం ద్వారా రైతులకు భూమిపై భద్రత కల్పించడంతో పాటు వ్యవసాయ రుణాలు, విద్యుత్, సాగునీటి సౌకర్యాలు పొందేందుకు అవకాశం కల్పించాలని కోరారు.ప్రభుత్వం ఈ సమస్యలను సత్వరమే పరిష్కరించి పోడు సాగుదారులకు వ్యవసాయం చేసుకునేందుకు అనుకూలమైన వాతావరణం కల్పించాలని సీపీఐ(ఎం) నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు వల్లూరి శ్రీనివాసరావు, గుగులోత్ కుమార్, కూచిపూడి నరేష్, కే. నవీన్ కుమార్, నాయకులు కృష్ణయ్య, మల్లయ్య, రమేష్, రవి పాల్గొన్నారు.

# బీఆర్ఎస్, బీజేపీ పార్టీల దళిత వ్యతిరేక చర్యలను అరికట్టాలి

**జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల్లు నూతి సత్యనారాయణ గౌడ్**

**నేడు అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ, పాలాభిషేకం**

**జిల్లా కాంగ్రెస్ పిలుపు**

ఖమ్మం సెప్టెంబర్ 10, జనం ముచ్చట:



బీఆర్ఎస్, బీజేపీ పార్టీల దళిత వ్యతిరేక చర్యలను అరికట్టాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, అర్బన్ జిల్లా ఖమ్మం కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి మాట్లాడుతూ ..
ఉత్తరాఖండ్ లో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే పాల్గొన్న ప్రదేశాన్ని బీజేపీ, మనువాద నాయకులు శుద్ధి చేసిన దాష్టీకం మరువక ముందే, అసెంబ్లీ ప్రారంభం రోజున బీఆర్ఎస్ పార్టీ శాసనమండలి సభ్యుడు తాతా మధు తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడం, అనంతరం ఎర్రవల్లిలో దళిత నాయకులు నిరసన తెలిపిన రోడ్లను బీఆర్ఎస్ నాయకులు పసుపు నీళ్లతో శుద్ధి చేయడం దారుణమన్నారు.
ఈ దళిత వ్యతిరేక చర్యలను నిరసిస్తూ నేటి ఉదయం 11 గంటలకు జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ నుండి జెడ్పీ సెంటర్ లోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.
కావున జిల్లా నలుమూలల నుండి కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.
ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, జిల్లా అనుబంధ సంఘ అధ్యక్షులు కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్, బొడ్డు బొందయ్య, ముక్క శేఖర్ గౌడ్, పుచ్చకాయల వీరభద్రం, విప్లవ కుమార్, తూములూరి లక్ష్మీ నరసింహారావు, మూడుముంతల గంగరాజు యాదవ్, కొట్టే రాజశేఖర్, దామా స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# 22ఏ భూములపై ఖమ్మంలో బీజేపీ సమరశంఖం




**ఖమ్మం (జనం ముచ్చట) సెప్టెంబర్ 10:** 22ఏ నిషేధిత ఆస్తుల జాబితాలో భూముల చేర్పు వ్యవహారంపై ఖమ్మంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సమరశంఖం పూరించింది. దశాబ్దాలుగా తమ భూములను సాగు చేసుకుంటూ అనుభవిస్తున్నప్పటికీ 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడంతో వాటిని విక్రయించుకోలేక, రిజిస్ట్రేషన్ చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్న రైతులు, పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో గురువారం ఖమ్మం కలెక్టరేట్ సమీపంలోని ధర్నాచౌక్‌లో మహాధర్నా నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, 22ఏ బాధితులు పెద్ద సంఖ్యలో ధర్నాకు తరలివచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. 22ఏ జాబితాలో తప్పుగా చేర్చిన భూములను వెంటనే తొలగించి, బాధితులకు హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు....

**పేదల భూములను 22ఏ నుంచి తొలగించాలి...**

ఈ సందర్భంగా బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారంలో బీజేపీ వెనకడుగు వేయదని స్పష్టం చేశారు. దశాబ్దాలుగా రైతులు అనుభవిస్తున్న భూములను అకారణంగా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల అనేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. అవసరమైన సమయంలో సొంత భూమిని విక్రయించుకోలేని పరిస్థితి ఏర్పడటంతో రైతు కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయని తెలిపారు. పిల్లల చదువులు, వివాహాలు, వైద్య ఖర్చులు, వ్యవసాయ పెట్టుబడులు వంటి అత్యవసర అవసరాలకు డబ్బు అవసరమైనా.. భూమి ఉన్నప్పటికీ దాన్ని ఆస్తిగా వినియోగించుకోలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రజల భూములను అన్యాయంగా 22ఏ జాబితాలో చేర్చితే చూస్తూ ఊరుకునేది లేదు. అవసరమైతే ప్రభుత్వ మెడలు వంచైనా సరే బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం" అని కోటేశ్వరరావు హెచ్చరించారు....

**మంత్రి పొంగులేటిపై బీజేపీ ఫైర్....**

రెవెన్యూ శాఖను పర్యవేక్షిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి 22ఏ సమస్య పరిష్కారంలో తగిన చొరవ చూపడం లేదని బీజేపీ నాయకులు ఆరోపించారు. సొంత జిల్లా ఖమ్మంలోనే పెద్ద సంఖ్యలో రైతులు భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నప్పటికీ శాశ్వత పరిష్కారం చూపడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. బాధిత రైతుల సమస్యలను పరిష్కరించలేని మంత్రి పదవిలో కొనసాగడానికి నైతిక హక్కు లేదని, వెంటనే రాజీనామా చేయాలని నెల్లూరి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు....



**రికార్డుల్లో ఒకలా.. 22ఏలో మరోలా....**

భూ రికార్డులు, రిజిస్ట్రేషన్ రికార్డులు, 22ఏ నిషేధిత జాబితా మధ్య అనేక చోట్ల వ్యత్యాసాలు ఉన్నాయని బీజేపీ నాయకులు ఆరోపించారు. కొంత భూమిపై మాత్రమే వివాదం ఉన్నప్పటికీ మొత్తం సర్వే నంబరును నిషేధిత జాబితాలో చేర్చిన సందర్భాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇలాంటి సమస్యల వల్ల అసలు హక్కుదారులు తమ భూములపై లావాదేవీలు నిర్వహించుకోలేకపోతున్నారని అన్నారు. ప్రతి భూమికి సంబంధించిన పాత రికార్డులు, పట్టాలు, రిజిస్ట్రేషన్ పత్రాలు, రెవెన్యూ రికార్డులను సమగ్రంగా పరిశీలించి నిజమైన హక్కుదారులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు....

**రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ దుమారం....**

22ఏ నిషేధిత భూముల వ్యవహారం ప్రస్తుతం ఖమ్మానికి మాత్రమే పరిమితమైన అంశంగా కాకుండా తెలంగాణవ్యాప్తంగా రాజకీయ చర్చకు దారితీసింది. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల సందర్భంగా కూడా 22ఏ వ్యవహారంపై బీజేపీ ఎమ్మెల్యేలు ఆందోళన వ్యక్తం చేస్తూ న్యాయ విచారణకు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ కూడా 22ఏ జాబితాలో భూముల చేర్పుపై న్యాయ విచారణ జరిపించాలని, పూర్తి వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేస్తోంది. అయితే రాజకీయ పార్టీలు చేస్తున్న ఆరోపణలపై ప్రభుత్వం అధికారికంగా విచారణ జరిపి వాస్తవాలను తేల్చాల్సి ఉంది.....

**తప్పులు జరిగితే సరిచేస్తాం: జాయింట్ కలెక్టర్...**

ఇదిలా ఉండగా 22ఏ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే స్పందించింది. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను అప్రమత్తం చేస్తూ.. కేవలం భూమి 22ఏ జాబితాలో ఉందనే కారణంతో రిజిస్ట్రేషన్ దరఖాస్తులను తిరస్కరించవద్దని, ప్రతి కేసును రికార్డుల ఆధారంగా సమగ్రంగా పరిశీలించాలని సూచించినట్లు ప్రభుత్వం తెలిపింది. కొన్ని భూములు పొరపాటున 22ఏ జాబితాలో చేరి ఉంటే వాటిని సరిచేస్తామని మంత్రి గతంలో పేర్కొన్నట్లు అధికారులు వెల్లడించారు. సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులు, భూ రికార్డులను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకురావడం ద్వారా పారదర్శకత పెంచే చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వం చెబుతోంది....

**హైకోర్టులోనూ 22ఏపై విచారణలు....**

22ఏ నిషేధిత జాబితాలో ప్రైవేటు భూముల చేర్పుపై తెలంగాణ హైకోర్టులోనూ పలు కేసులు విచారణకు వచ్చాయి. ఇప్పటికే తుది నిర్ణయాలు వెలువడిన భూములను కొత్త ఆధారాలు లేకుండా లేదా మోసం జరిగినట్లు నిర్ధారణ లేకుండా తిరిగి నిషేధిత జాబితాలో చేర్చడంపై కోర్టు కొన్ని సందర్భాల్లో అభ్యంతరాలు వ్యక్తం చేసింది. భూ రికార్డులు, రిజిస్ట్రేషన్ వివరాలు, నిషేధిత జాబితా మధ్య ఉన్న వ్యత్యాసాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చట్టపరమైన ప్రక్రియను పాటించాల్సిన అవసరం ఉందనే అంశం ఈ వ్యవహారంలో కీలకంగా మారింది.

**భూమి ఉన్నా.. ఉపయోగించుకోలేని పరిస్థితి....**

రైతు కుటుంబానికి భూమి కేవలం ఆస్తి మాత్రమే కాదని, వారి ఆర్థిక భద్రతకు ప్రధాన ఆధారమని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. భూమిని అవసరమైన సమయంలో విక్రయించుకోలేకపోతే పిల్లల చదువులు, వివాహాలు, వైద్యం, వ్యవసాయ పెట్టుబడులు వంటి అవసరాలకు ఆర్థిక వనరులు సమకూర్చుకోవడం కష్టమవుతుందని తెలిపారు. ప్రభుత్వ ప్రయోజనాలను రక్షించాల్సిన నిజమైన నిషేధిత భూములను కొనసాగిస్తూనే.. తప్పుగా లేదా అనవసరంగా 22ఏలో చేర్చిన భూములను గుర్తించి వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. భూ భారతి విధానం, భూ రికార్డుల పరిశీలన, రీసర్వే వంటి ప్రక్రియల ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

**బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం...**

22ఏ జాబితాలోని భూముల సమస్య పరిష్కారం అయ్యే వరకు బీజేపీ పోరాటం కొనసాగుతుందని నెల్లూరి కోటేశ్వరరావు ప్రకటించారు. ఖమ్మం నుంచి ప్రారంభమైన ఈ ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు పార్టీ సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు, వరంగల్ ప్రభారి కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, నల్గొండ ప్రభారి సన్నె ఉదయ్ ప్రతాప్, మాజీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గల్లా సత్యనారాయణ, రాష్ట్ర అధికార ప్రతినిధులు నంబూరి రామలింగేశ్వరరావు, వాకదాని పుల్లారావు యాదవ్, మాజీ కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రుద్ర ప్రదీప్, రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శులు గుత్తా వెంకటేశ్వరరావు, నాయుడు రాఘవరావు, ప్రవీణ్, బీజేపీ నాయకులు నున్నా రవి, విజయరాజు, మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుకూరు రమేష్, భూక్య శ్యాంసుందర్, మమ్మీ అనిత, జ్వాల నరసింహారావు, జిల్లా ఉపాధ్యక్షులు నకిరకంటి వీరభద్రం, వీరెల్లి రాజేష్, రవి రాథోడ్, వీరం రాజ్, సుదర్శన్ మిశ్రా, ఏలూరి నాగేశ్వరరావు, మంద సరస్వతి, మనీ, రజిని రెడ్డి తదితరులు పాల్గొన్నారు....

# అన్నం ఫౌండేషన్ లో వైద్య శిబిరం

**ఖమ్మం అర్బన్ సెప్టెంబర్ 10 జనం ముచ్చట**

ఖమ్మం నగరంలోని అన్నం సేవా ఫౌండేషన్లో ఉన్న అనాధులకు గురువారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కలెక్టర్ ఆదేశంతో జిల్లా వైద్యాధికారి డాక్టర్ రామారావు సారధ్యంలో మంచుకొండ వైద్యశాల నుండి డాక్టర్ మద్దినేని పూజ సమక్షంలోవైద్య సిబ్బంది అన్నం ఫౌండేషన్ లోని 45 మంది దివ్యాంగులకు వైద్య పరీక్షలు చేసి కొందరికి మందులు పంపిణి చేశారు. ఈ సందర్భంగా అన్నం ఫౌండేషన్ గౌరవ కలెక్టర్ కి,వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

